నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | మార్చి 02, 2024 | www.navatelangana.com

వాలీబాల్ కిట్‌ను అందజేసిన ఏఎస్ఐ

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని ముత్యంపేట్ యువకులకు పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఏఎస్ఐ కాళ్లే రమేష్ వాలీబాట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్పీ ఆదేశానుసారం యువకులకు వాలీబాల్ కిట్‌ను పంపిణీ చేశామన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు నవీన్, తెలంగ్‌రావ్, హోంగార్డ్ భరత్ పాల్గొన్నారు.



బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధం

అనుమతి లేకుండా డ్రోన్, డీజే సౌండ్స్ వినియోగించొద్దు : సీపీ శ్రీనివాస్

జైపూర్ : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధమని పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం తాగి అసభ్య పదజాలంతో మాట్లాడటం ప్రజలకు ఇబ్బందిగా మారిందని, మద్యం ప్రియుల ఆగడాలకు కళ్లెం వేయడంతో పాటు ప్రజలకు భద్రత కల్పించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. డీజే సౌండ్‌ల వినియోగంపై అమలులో ఉన్న నిషేదాజ్ఞలు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చిన్న పిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా శబ్ధ కాలుష్యం నుండి కాపాడేందుకు డీజే సౌండ్ వినియోగంపై నిషేదాజ్ఞలు విధించామన్నారు. అవసరమైనప్పుడు సంబంధిత డివిజన్ ఏసీపీల అనుమతి పొందాలని సూచించారు. డీఐజీ హోదాలో ఉన్న శ్రీనివాస్‌కు ఐజీ హోదా కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఐజీ హోదాలో పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పాల్గొన్నారు.

ధరణి బాధలు తప్పేనా..?

- ఏండ్లుగా తిరుగుతున్నా లభించని మోక్షం
- తాజాగా సర్కారు ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన స్పెషల్ డ్రైవ్
- ఇప్పటికైనా పరిష్కారంపై అన్నదాతల ఆశలు



భీమారం తహసీల్దార్ కార్యాలయంలో ధరణి దరఖాస్తులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, సిరికొండ

భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ మరిన్ని సమస్యలు తెచ్చిపెట్టింది. 2020లో అప్పటి సీఎం కేసీఆర్ ప్రారంభించిన ఈ ధరణి పోర్టల్‌తో సమస్యలు పరిష్కారం కాకపోగా.. అన్నదాతలకు మరిన్ని అవస్థలు తెచ్చిపెట్టింది. ఈ పోర్టల్ ద్వారానే రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలు సులువుగా అమలవుతాయని చెప్పిన అప్పటి ప్రభుత్వం దీని ద్వారా ఎదురైన సమస్యలను మాత్రం పట్టించుకోలేదు. ఫలితంగా భూముల గుర్తింపులో అనేక లోపాలు తలెత్తడంతో అన్నదాతలు వాటిని సరిచేసుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ విషయం గమనించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలోనే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని ప్రకటించగా.. ప్రజలు ఎన్నికల్లో మద్దతు పలికినట్లు తెలుస్తోంది. తాజాగా ధరణి ద్వారా చోటుచేసుకున్న భూ సమస్యలన్నింటిని పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 9వ తేదీ వరకు పరిష్కరించాలని ఇందుకు తహసీల్దార్, ఆర్డీఓలు, కలెక్టర్లకు ప్రత్యేక అధికారాలు కల్పిస్తున్నట్లు స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు మండలాల వారీగా ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించారు. ధరణిలో చోటుచేసుకున్న తప్పులకు సంబంధించి ఇప్పటి వరకు ఆయా మండలాలకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన చేపడుతున్నారు.

అనేక తప్పులకు కారణం..!

గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ అనేక తప్పులకు కారణమైందనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ పోర్టల్‌లో భూముల వివరాలు నమోదు చేయగానే ఒకరి భూమి మరొకరి పేరు మీద నమోదు కావడం, సర్వే నెంబర్ల తప్పులు, భూమి ఎక్కువగా ఉంటే పాస్‌బుక్‌లో తక్కువగా నమోదు కావడం, ఆధార్ నెంబర్లు సైతం తప్పులు పడటం, భూయజమానుల పేర్లు తారుమారు కావడం, పట్టా భూములు అసైన్డ్‌గా నమోదు కావడం, వ్యవసాయ భూములను నివాసిత ప్రాంతాలుగా గుర్తించడం, సాగు చేస్తున్న పట్టా భూములు నిషేధిత జాబితాలో చేర్చటం తదితర అనేక సమస్యలకు ఈ పోర్టల్ కారణమైంది. దీంతో భూ సంబంధిత యజమానులు వాటిని సరిచేసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయాలతో పాటు ప్రజావాణి చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. చిన్న చిన్న తప్పులను సరిచేయలేని పరిస్థితి ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా జిల్లాల్లో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చినా వాటిని పరిష్కరించడంలో విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా కొన్ని చోట్ల ఏండ్లుగా సాగు చేసుకుంటున్న భూములను ధరణి పోర్టల్‌లో ఇతరుల పేర్ల మీద ఉండటంతో ఇరువురి కుటుంబాల మధ్య ఘర్షణలు తలెత్తిన సందర్భాలున్నాయి. ప్రతి సోమవారం ఆయా జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ప్రజావాణికి ధరణిలో చోటు చేసుకున్న తప్పులను సరిచేయాలని వచ్చే దరఖాస్తులే అధికంగా ఉంటున్నట్లు రెవెన్యూవర్గాలు చెబుతున్నాయి. ఆయా జిల్లాల్లో ధరణి

ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో గత సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 17 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఆరు అప్లికేషన్లు ఇతరశాఖలకు సంబంధించినవి రాగా.. 11 దరఖాస్తులు ఏకంగా రెవెన్యూపరమైన సమస్యలకు సంబంధించినవి ఉన్నాయి. ఇలా ప్రతి వారం రెవెన్యూ సమస్యలతో ఆర్జిదారులు కలెక్టరేట్‌కు రావడం గమనిస్తే ఈ సమస్యలు ఎంత మేరకు ఉన్నాయో తెలుస్తుంది.





సిరికొండ మండల కేంద్రానికి చెందిన ఈమె పేరు తాళ్ల భూమవ్వ. భర్త చనిపోవడంతో ఎకరం భూమిని ఈమె పేరున మార్చుకునేందుకు ఏడాది క్రితం మీసేవ కేంద్రంలో దరఖాస్తు అందించారు. చలాన్ ద్వారా ప్రభుత్వానికి డబ్బులు కూడా చెల్లించారు. కానీ ఇప్పటి వరకు పరిష్కారం లభించడం లేదు. పలుమార్లు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఎలాంటి ఫలితం ఉండటం లేదు. ఇలాంటి భూ బాధితులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక మంది ఉన్నారు. ధరణి పోర్టల్ కారణంగా చాలా మంది అన్నదాతలు తిప్పలు పడుతున్నారు.

ఇప్పటికైనా పరిష్కారమయ్యేనా..?

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్ తొలగించి దాని స్థానంలో మరింత మెరుగైన వ్యవస్థను తీసుకొస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీనిచ్చింది. వారి హామీని నమ్మిన ప్రజలు ఆ పార్టీకి పట్టం కట్టారు. తాజాగా అధికారంలోకి సుమారు మూడు నెలలు కావస్తుండటంతో ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను ప్రక్షాళన చేయాలని భావించింది. ఇందుకు సుమారు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మండలాల వారీగా ప్రత్యేక రెవెన్యూ బృందాలను నియమించారు. మండల స్థాయిలో మూడు రోజులు, ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలో వారం రోజుల్లో పరిష్కరించాలని, సీసీఎల్ఏ స్థాయిలో వారం రోజుల్లో పరిష్కారం చూపించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో అనేక మంది అన్నదాతలు భూ సంబంధిత సమస్యల పరిష్కారంపై ఆశలు పెట్టుకున్నారు. ఇన్నాండ్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని.. కనీసం ఈ వారం రోజుల్లోనైనా పరిష్కారమైతే బాగుంటుందని పలువురు బాధిత రైతులు చెబుతున్నారు.

పేదల గుడిసెలకు పట్టాలివ్వాలి

- ఎమ్మెల్యే వివేక్‌కు సీపీఐ(ఎం) వినతి



నవతెలంగాణ - హాజీపూర్

చెన్నూర్‌లో పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యే వివేక్‌కు సీపీఐ(ఎం) జిల్లా కమిటీ అధ్వర్యంలో జిల్లా కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ చెన్నూరు మండలం బావురావుపేట శివారు సర్వేనెంబర్ 8లో గల 27 ఎకరాల ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకొని 11 నెలలుగా పోరాటం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం పేదలపై 6 కేసులు, బైండవర్ కేసు పెట్టిందని తెలిపారు. పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. విద్యుత్, మంచి నీటి సౌకర్యం కల్పించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. వారి వెంట పార్టీ నాయకులు బోడంకి చందు, ఉమారాణి, సమ్మక్క, నగేష్, కుమార్, రమాదేవి, రాజేశ్వరి, జమున ఉన్నారు.

జిల్లా అభివృద్ధిపై మోడీ మాట్లాడాలి

- అభివృద్ధి సాధన పోరాట కమిటీ డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన సీసీఐ పునరుద్ధరణ, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్, ఆదిలాబాద్ ఏరోడ్రమ్, గిరిజన యూనివర్సిటీ, టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు గురించి ప్రధాన మంత్రి మోడీ సభలో మాట్లాడి జిల్లా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి సాధన పోరాట కమిటీ కన్వీనర్ బండి దత్తాత్రి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో సాధన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి అనేక హామీలిచ్చి తీరా గెలిచాక విస్మరించారని విమర్శించారు. 4న ప్రధాన మంత్రి జిల్లా ప్రజలకు జిల్లా అభివృద్ధికి ఏం చేశారో తెలపాలని, గతంలో ఇచ్చిన హామీల అమలుకు కార్యాచరణ ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ 10 ఏండ్ల పాలనలో జిల్లా అభివృద్ధికి ఒక్క ప్రాజెక్టు కేటాయించలేదని విమర్శించారు. ప్రజలను మళ్లీ మోసం చేసే విధంగా ఓట్ల కోసమే సభ పెడితే జిల్లా ప్రజలు ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో కో కన్వీనర్ ముడుపు ప్రభాకర్‌రెడ్డి, గణపతిరెడ్డి, దర్శనాల మల్లేష్, రోకండ్ల రమేష్, కొండా రమేష్, జగన్‌సింగ్, రాహుల్, ఉదయ్ కిరణ్, సూసం సచిన్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో వివిధ విభాగాలలో 20ఏళ్లుగా పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని ఉద్యోగుల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షులు భూసారపు గంగాధర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వాసవి స్కూల్‌లో ఉద్యోగుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు చాలీచాలని జీతాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ, పీజీ, బీఈడీ పూర్తిచేసి అన్ని రకాల విద్యార్హతలు కలిగి ఉండి ప్రభుత్వ పరీక్ష ద్వారా ఎన్నికైన ఉద్యోగులు 20ఏళ్లుగా ఒకే జీతంలో పనిచేస్తున్నారని తెలిపారు. ఇందులో జిల్లా స్థాయిలో కంప్యూటర్ ఆపరేటర్లు, సిస్టం అనాలిసిస్టులు మండల సమన్వయకర్తలు, కంప్యూటర్ ఆపరేటర్లు మెసెంజర్లు, సిఆర్పిలు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, సిఆర్‌టిలు, నాన్ టీచింగ్ స్టాఫ్ ఉన్నారన్నారు. విద్యా శాఖలో అందరూ కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అందరికీ ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, గత ప్రభుత్వాలకు ఎన్నో వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఫలితం శూన్యం అని వాపోయారు. గతంలో నెల రోజుల పాటు ధర్నాలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. కొత్త ప్రభుత్వం కొలువు తీరడంతో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశతో ఉన్నామని, కానీ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలైనా ఇప్పటివరకు సమగ్ర శిక్ష ఉద్యోగుల గురించి పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి గతంలో తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. లేనట్లయితే మళ్లీ ఆందోళనలకు దిగాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గజేందర్, భోజన్న, రాము, నరేష్, లింగన్న ప్రసాద్, సాగర్, సవిత, నవత, సింధు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ.వెంకట్



నవతెలంగాణ-నిర్మల్

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని టీఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ.వెంకట్ అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా విస్తృత సమావేశం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్ అధ్యక్షన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రభుత్వ విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, గెస్ట్ సిబ్బందికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించి పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెంట అశోక్, కోశాధికారి కుర్మే నాగయ్య, సహధ్యక్షులు మనోహర్‌రెడ్డి, జిల్లా నాయకులు పరమేశ్వర్, బక్కన్న, ప్రేమ్‌కుమార్, బిక్కు రమేష్, టి లింగన్న, రమేష్, టి.భూమన్న, ఎం.భీమయ్య, సొన్న గంగాధర్, ఎస్‌కే.ఫాజిల్, రవికిరణ్ కుమార్, సిహెచ్ గోవర్ధన్‌రావు, ఎస్.అనిల్‌కుమార్, జి.రామ్‌దాస్, అంబటి నారాయణ, రాథోడ్ గణపతి, నారాయణ వర్మ, ఏ.లక్ష్మణ్, మనోహర్, వేణుగోపాల్, గంగమౌళి, మహేష్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదివాసులపై ఇంత నిర్లక్ష్యమా?

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి డి.మల్లేష్
- విద్యార్థుల కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్



నవతెలంగాణ-జైనథ్

రెండు రోజుల వ్యవధిలో మండలంలోని మాంగుర్ల గ్రామంలో ఇద్దరు గిరిజన విద్యార్థులు చనిపోతే కనీసం అధికార యంత్రంగం, ఓట్లతో గెలిచిన ప్రజా ప్రతినిధులు ఆ కుటుంబాలను పరామర్శించకపోవడం బాధాకరమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. శుక్రవారం మాంగుర్ల గ్రామంలో అధికారుల నిర్లక్ష్యంతో మరణించిన మామిడిగూడ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మహేశ్వరి, పరీక్షకు హాజరుకాలేక బాధతో ఆత్మహత్య చేసుకున్న టేకం శివకుమార్ కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరి, శివకుమార్ కుటుంబాలను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా చనిపోయిన మహేశ్వరి కుటుంబ సభ్యులకు ఉద్యోగం, రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించి విద్యార్థుల ఆరోగ్యలను కాపాడాలని కోరారు. శివకుమార్ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఒకే ఊరిలో రెండు సంఘటనలు రెండు రోజుల వ్యవధిలో జరిగినా ఐటిడిఏ యంత్రాంగం కనీసం మానవత్వంతోనైన పరామర్శించకపోవటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్‌సింగ్, తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూసం సచిన్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సాయికుమార్ ఉన్నారు.

విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



జైపూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. రూ.20లక్షల అంచనా వ్యయంతో ఇందారం గ్రామంలో నిర్మించ తలపెట్టిన ఆరోగ్య కేంద్రం పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందారంతో పాటు పరిసర గ్రామాల వారికి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం కోసం ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని ఆరు నెలల వ్యవధిలో పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్యం అందించి ప్రజలకు ఆర్థిక భారం పడకుండా చూడాలన్నది సీఎం ధ్యేయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ బన్సీలాల్, ఎస్సై ఉపేందర్‌రావు, ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణగౌడ్, కుందారం వైద్యాధికారి శ్రావ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహమ్మద్ ఫయాజోద్దీన్, మంచిర్యాల జిల్లా నాయకులు రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ఆసంపల్లి శ్రీకాంత్, చల్ల విశ్వంబర్ రెడ్డి, రిక్కుల లక్ష్మినారాయణరెడ్డి, కుందారం శేఖర్, బేతు తిరుపతిరెడ్డి, గుడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ముదాం రమేష్, జైనోద్దీన్, జక్కుల వెంకటేశం, సుంకరి శ్రీనివాస్, చల్ల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

డీఎస్సీలో తక్కువ పోస్టులు చూపించారని ఆందోళన



ఆదిలాబాద్‌టౌన్ : ప్రభుత్వ ప్రకటించిన డీఎస్సీలో ఆదిలాబాద్ జిల్లాలో ఎస్జీటీ పోస్టులను స్థానిక డీఈఓ తక్కువ చూపించారని బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు ఆరోపించారు. డీఈఓ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డీఈఓకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ గత డీఎస్సీలో 145 పోస్టులను చూపించారని, ఈ డీఎస్సీలో కేవలం మూడు పెంచి 148 చూపించారని అన్నారు. డీఈఓ నిర్లక్ష్యం కారణంగా ఎస్జీ పోస్టులు తక్కువగా చూపించారన్నారు. ఈ విషయమై డీఈఓను కలిస్తే మళ్లీ దాన్ని సవరించి పంపిస్తామని చెబుతున్నారన్నారు. నోటిఫికేషన్ వచ్చిన తరువాత ఎలా సరిచేస్తారని ప్రశ్నించారు. మిగతా జిల్లాలో అభ్యర్థులు లేకపోయినా 3 నుంచి 4 వందల పోస్టులు పెట్టారన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమలో అభ్యర్థులు రంజీత్, ప్రవీణ్, వైష్ణవ్, రవి కిరణ్, రాజ్‌కుమార్, కిరణ్, ప్రమోద్, శివ పాల్గొన్నారు.

కళాశాలలో ప్రవేశ ప్రచార వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ప్రవేశ ప్రచార వాల్ పోస్టర్లను శుక్రవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు, ప్రతిభావంతులైన అధ్యాపకులు ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరాలని కోరారు. తమ కళాశాలలో అనేక కోర్సులు, సౌకర్యాలు, లైబ్రరీ అందుబాటులో



ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్, టీజీసీజీటీటీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దయాకర్, నరసింగరావు, కళాశాల యూనిట్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు విజయకుమార్, రమేష్, సంతోష్ కుమార్ అధ్యాపకులు జాకీర్ హుస్సేన్, రఘునాథ్, జగ్‌రామ్, ప్రతాప్ సింగ్, తిరుపతి, అనిత, జోత్స్న, రాజ్ కుమార్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 4న జిల్లా కేంద్రంలో తల పెట్టిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని, జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మహాగావ్ శేకుగూడలో బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. బహిరంగ సభకు బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలు, శక్తి కేంద్ర ఇన్‌ఛార్జీలు, బూత్ కమిటీ అధ్యక్షులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, బీజేపీ మండలాధ్యక్షులు తొడసం బండు, జిల్లా నాయకులు బాబులాల్ రాథోడ్, జాదవ్ రెడ్డి నాయక్, నాయకులు బిక్కు రాథోడ్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్, రాంచందర్, గజానంద్, యశ్వంత్, జుగ్నాక్ వినోద్, బిక్షపతి ఉన్నారు.

అల్లోల హన్మంత్‌రెడ్డి ద్వాదశ దినకర్మ



నవతెలంగాణ-నిర్మల్

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అల్లోల హన్మంత్‌రెడ్డి ద్వాదశ దినకర్మను శుక్రవారం నిర్మల్ మండలం ఎల్లపల్లిలోని వారి స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తన సోదరుడు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి హాజరయ్యారు. హన్మంత్‌రెడ్డి చిత్ర పటానికి పూలు వేసి నివాళు లర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. నిర్మల్ నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున హన్మంత్ రెడ్డి అభిమానులు, మిత్రులు, బంధువులు, పలువురు రాజకీయ నాయకులు ద్వాదశ దిన కార్యక్రమానికి హాజరయ్యారు. హన్మంత్‌రెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అల్లోల కుటుంబ సభ్యులు, ఆయా పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రేపు డిగ్రీ కళాశాలలో వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో మార్చ్ 3న ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జలగం అనిత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ది టైమ్స్ ప్రో వారి సహకారంతో ఆక్సిస్, ఐసీఐసీఐ, యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, డెలివరీ అండ్ ఫ్లిప్ కార్ట్‌లలో శాశ్వత ప్రాతిపాదికన కొరకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.20వేల పైన జీతభత్యాలు ఉంటుందన్నారు. ఏదైనా డిగ్రీ, బిటెక్‌లో 50శాతం మార్కులు కలిగి, ఉన్నవారు, 27 సంవత్సరాలలోపు వయసు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 8106764653లను సంప్రదించాలని అకాడమిక్ కోఆర్డినేటర్ పి.ప్రభాత్‌రావు, టీఎస్‌కేసీ మెంటర్ చైతన్య కృష్ణ కోరారు. ఆసక్తి గల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధి హామీ ఏపీఓగా భీంరావు

నవతెలంగాణ-సిరికొండ

ఉపాధి హామీ ఏపీఓగా, ఈసీగా బాధ్యతలు నిర్వహిస్తున్న భీంరావ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి కూలిలందరికి పనులు కల్పించే విధంగా చూస్తానని అన్నారు. అనంతరం ఎంపీడీఓ బాల గంగాధర్‌ను, ఉపాధి సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, నాయకులు అనిల్, లతీఫ్, గోపాల్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు లింగ సమానత్వం, ఆర్థిక విద్యపై అవగాహన

నవతెలంగాణ-నిర్మల్

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిట్యాల గ్రామంలో ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు ఎ.మౌనిక, కె.శైలజ విద్యార్థులకు లింగ సమానత్వం, ఆర్థిక విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బాలికలు కష్టపడి చదివి అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. తమను ఎవరైనా వేదింపులకు గురి చేస్తే సఖి హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098నెంబర్‌లకు ఫోన్ చేయాలని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం సంబాల్, సామర్థ్య కార్యక్రమాల ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తుందని, మహిళ సాధికారత సాధించటానికి, ప్రభుత్వం సహకరిస్తుందని తెలియజేశారు. ఆడ పిల్లలు ఒంటరిగా నిర్జన ప్రాంతాలలో తిరగ కూడదని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ వెంకటేష్, ఉపాధ్యాయులు గజపల్లి నర్సయ్య, కుమార్, పోతన్న, వహీద్, రాజేశ్వరీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు నేడు పాదయాత్ర

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఆయన పట్టణంలో అడవి జంతువులపై అవగాహన పాదయాత్ర చేపట్టి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ పాదయాత్రను 43వ వార్డు కౌన్సిలర్ బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, తాలూకా మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. ఈ పాదయాత్ర పట్టణంలోని ప్రధాన చౌక్‌ల మీదుగా కొనసాగుతుందని పేర్కొన్నారు. పాదయాత్రలో భాగంగా వన్యప్రాణుల ఆవశ్యకత గురించి ముద్రించిన కరపత్రాలను పట్టణ ప్రజలకు పంచుతూ ఈ అవగాహన పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని మల్లాపూర్, పీచర, పార్‌పెల్లి సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మత్తు పనులు జరుగుతున్న దృష్ట్యా శనివారం ఉదయం 8:30 గంటల నుంచి 1 గంటల వరకు మల్లాపూర్, మాచపూర్, పీచర, మునిపల్లి, పార్‌పెల్లి, ధర్మారం గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ మహేష్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పార్డి(బి)లో వాటర్ ప్లాంట్ ప్రారంభం



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి) గ్రామంలో శుక్రవారం అంబికా వాటర్ ప్లాంట్‌ను బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ మోహన్‌లు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల మండలంలోని పార్డి(బి) గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండేలా వాటర్ ప్లంట్‌ను ఏర్పాటు చేసి తక్కువ ధరకు సురక్షిత మంచి నీళ్ల సదుపాయం కల్పించేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, మోసిన్, సంధ్యారాణి, బీజేపీ నాయకులు శేఖర్, మాజీ ఉపసర్పంచ్ తుకారాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కల్పించాలి



నవతెలంగాణ-నిర్మల్

పీఎం విశ్వకర్మ యోజన పథకానికి సంబంధించి గ్రామీణ స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీఎం విశ్వకర్మయోజన పథకంపై ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ పథకం అర్హులైన లబ్దిదారులకు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో పంచాయతీ సెక్రటరీలు ఈ పథంలో చేతి వృత్తులవారు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. అర్హులైన 18 రకాల చేతి వృత్తుల వారికి మొదటి విడతలో ఐదు శాతం వడ్డీకే లక్ష రూపాయల ఋణాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. ఈ మొత్తాన్ని 18 నెలల్లో చెల్లించిన వారికి రెండో విడతలో రెండు లక్షల రుణాన్ని ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. రుణాన్ని 30 నెలల్లో తిరిగి చెల్లించాలని తెలిపారు. మీసేవ కేంద్రాల్లో, గ్రామ, వార్డు పంచాయతీల్లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. లబ్దిదారులకు నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో వారం రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, శిక్షణ కాలంలో రోజుకి రూ.500ల చొప్పున వేతనం లభిస్తుందని అన్నారు. అనంతరం గ్రామాలవారీగా ఇప్పటివరకు దరఖాస్తుల నమోదు వివరాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహ రెడ్డి, ఎల్‌డీఎం చంద్రశేఖర్, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీపీఓ శ్రీనివాస్, స్టీరింగ్ కమిటీ సభ్యులు రాజు, రాజేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహనీయుల జీవిత చరిత్రలు ఆదర్శం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జీవితంలో సంఘటలు ఎదురైనప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొవడానికి మహనీయుల జీవిత చరిత్రలు ఎంతో దోహదం చేస్తాయని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. స్వామి వివేకానంద రామకృష్ణ మఠం స్థాపించి 125 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సమితి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించారు. వివేకానంద భారత జాతికి నా హితవు అనే పుస్తకంపై పోటీ పరీక్షలు నిర్వహించగా గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం మహాలక్ష్మీవాడలోని ప్రభుత్వ పాఠశాలలో బహుమతులను అందజేశారు. దీనికి భజరంగ్‌లాల్ అగర్వాల్‌తో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా అతిథులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిమిషం అలస్యమైందని, జీవితంలో ఎమి సాధించలేని విద్యార్థులు క్షణికావేశానికి లోనై తమ ప్రాణాలను కొల్పోతున్నారన్నారు. ఇలాంటి సంఘటనలు వచ్చినప్పుడు వివేకానంద జీవిత చరిత్రను చదవిధైర్యం పెంచుకోవాలన్నారు. కష్టపడి చదివడంతో పాటు ఆత్మస్థైర్యం కూడా ఉండాలన్నారు. జీవితంలో విజయం సాదించడానికి అనేక అవకాశాలు వస్తాయన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. విద్యార్థులకు మహనీయుల జీవిత చరిత్రపై పోటీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కే సేవా సమతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆరె భూమన్న, కోరెడ్డి లెనిన్, సభ్యులు హన్మండ్లు, శ్రీధర్, పాఠశాల హెచ్ఎం పిల్లి కిషన్, ఉపాధ్యాయులు నరేందర్, హరిచరణ్, వీణ, వైభవ్, రాము, బీజేపీ నాయకులు బోయర్ విజయ్, గంద్రత్ మహేందర్, కేశవ్ పాల్గొన్నారు.

పర్ధాన్ కులస్తుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని ఆదివాసీ పర్ధాన్ కులస్తులు గత కొన్నేండ్ల నుంచి అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకులు పూసం ఆనంద్‌రావ్, కుర్సేంగే తానాజీ, మెస్రం కృష్ణలు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల గోండి ధర్మగురు హీరాసుక మందిరం ఆవరణలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ పర్ధాన్ కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా ఎంతో వెనుకబడి ఉన్నారన్నారు. నివాసం ఉండేందుకు ఇంటి స్థలాలు లేక, అద్దె ఇండ్లలలో నివాసం ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇంటి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. నాన్ ఏజన్సీ ప్రాంతాంలో నివాసం ఉంటున్న ఆదివాసీ పర్ధాన్ కులస్తులకు ఏజన్సీ వారికి అమలు చేస్తున్న పథకాలను వర్తింపజేయాలని అన్నారు. నిరుద్యోగ యువతకు ఐటీడీఏ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం అఖిల భారతీయ ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జాతీయ

- ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకులు



ఉపాధ్యక్షుడు సిడాం రాంకిషన్ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకులు మడావి శంకర్, గేడం మాధవ్, సెడ్మకి సుభాష్, గేడం జనార్ధన్, కుడ్మేత ప్రకాష్, మహిళ నాయకురాలు గంగాదేవి, బీజేపీ నాయకులు చిట్యాల సుహాసినిరెడ్డి, నారాయణ్‌రెడ్డి ఉన్నారు.

సమాజంలో విలువైనది ఉపాధ్యాయ వృత్తి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో విలువ ఉందని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ఎడ్యుకేషన్‌లో కలింగ యూనివర్సిటి రాయపూర్ నుంచి పీహెచ్‌డీ పట్టాను వివేకానంద అధ్యాపకురాలు ప్రణతి పొందారు. కాగా శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి పాల్గొని సత్కరించారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ పట్టా పొందడానికి పడిన కష్టంపై అథితులు తెలిజేస్తు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మెన్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉందని, ఛాత్రోపాధ్యాయులు ఈ వృత్తిని ఎంచుకోవడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు అక్కడే ఆగిపోకుండా పరిశోధనలు చేస్తూ ఉన్నతంగా ఎదగాలన్నారు. అక్షర క్రమంలో మొదటి స్థానంలో ఆదిలాబాద్ ప్రస్తుతం విద్యారంగలో కూడా రాణించడం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో తలమడుగు జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, కళాశాల ఇన్‌చార్జీ దారట్ల కిష్టు, కార్యదర్శి పున్నరావ్, సుంకిడి ఎంపీటీసీ వెంకన్న, లింగారెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం డాక్టర్ విక్రమ్ ఆధ్వర్యంలో 55 మంది గర్భిణీలకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. గుంజాల సబ్ సెంటర్ పరిధిలోని 15 మంది, నాగల్ కొండ సబ్ సెంటర్ పరిధిలోని 15 మంది, కొత్తపల్లి సబ్ సెంటర్ నుంచి 10 మంది, మండల కేంద్రంలోని పరిధిలోని 15 మంది, మొత్తం కలిపి 55 మంది గర్భిణీలకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం తీసుకోవాల్సిన పౌష్టికాహారం, పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య శిబిరంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాంబాబు, సీహెచ్ఓ లక్ష్మి హెచ్ఈఓ నాందేవ్ హెల్త్



సూపర్‌వైజర్లు సతవ్వ రాజమ్మ, చౌహన్ చరణ్‌దాస్, సిబ్బంది హిమబిందు, ఆడే జ్యోతి, కల్పన ఉన్నారు.

కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు వొద్నల రాజేశ్వర్ మాట్లాడుతూ పార్టీ ఎవరికి టికెట్టు ఇచ్చిన పార్టీ అధిష్టానం మేరకు కార్యకర్తలు పని చేస్తారని, అదేవిధంగా పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటామని తెలియజేశారు. నాయకులు ఈటెల శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి గెలుపుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు అట్ల రాంరెడ్డి, నగేష్, నారాయణ, బిర్కుల నర్సయ్య, రమేష్, నర్సయ్య, శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, గురాల లింగారెడ్డి, దినేష్, సురేష్, పృథ్వి కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఎంఈఓ



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఎంఈఓ మధుసూదన్ శుక్రవారం ఎంపీపీఎస్ ధర్మారం, ఎంపీపీఎస్ పీచర, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పీచర పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి, రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పీచరలో ప్రీ ఫైనల్ పదో తరగతి పరీక్షల గురించి, విద్యార్థులను ఉద్యేశించి, పరీక్షా అంటే భయమొద్దని, బాగా చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు విషయాల పట్ల సందేహాలు ఉంటే ఎప్పటి కప్పుడు నివృత్తి చేసుకోవాలని అన్నారు. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీ సుధాకర్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 264 మంది గైర్హాజరు

నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని 6పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, విద్యార్థులు సమయానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను విధించారు. శుక్రవారం నాటి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆరు కేంద్రాల్లో 1922 మంది ఉన్నారు. అందులో 1658 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 264 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా క్రికెట్ పోటీలు కొనసాగగా శుక్రవారం కబడ్డీ పోటీలను నిర్వహించారు. కబడ్డీ పోటీలకు దాదాపు 7టీంలు వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గత కొద్ది రోజుల నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభం కాగా 30 టీమ్‌లు పాల్గొంటున్నట్టు యూత్ సభ్యులు తెలిపారు. క్రికెట్ కబడ్డీ పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వీతీయ, తృతీయ బహుమతులను అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పిడుగు అభిరామిరెడ్డి, మంతెన శ్రీకాంత్, సత్యపాల్, కాడే రాములు, పన్నాల బొమ్మరెడ్డి, పడగెల నారాయణరెడ్డి, తోట వెంకటేశ్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించిన విద్యార్థిని

నవతెలంగాణ-బోథ్



మండలంలోని సొనాల గ్రామానికి చెందిన బోయినపల్లి రాములు లక్ష్మి దంపతులు కూతురు బోయినపల్లి జ్యోతి ఇటీవల వెలువడిన గురుకుల విద్యాలయ ఫలితాల్లో సత్తా చాటింది. అలాగే టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్‌లోని ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు ఎంపికైంది. అలాగే సొనాల గ్రామానికి చెందిన విద్యార్థిని వృత్తిరీత్యా చిన్న పాటి దుకాణంలో పూజా సామాగ్రి అమ్ముకొని కుటుంబాన్ని పోషిస్తున్నారు. అలాగే సొనాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదవి ప్రభుత్వ జూనియర్ కళాశాల బజార్‌హత్నూర్‌లో ఇంటర్మీడియట్, అదే గ్రామంలోని పద్మావతి డిగ్రీ కళాశాలలో తెలుగు లిటరేచర్ పూర్తిచేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ తెలుగు, తెలంగాణ యూనివర్సిటీలో బీఈడీ 2021లో పూర్తి చేసి సెట్ ఉత్తీర్ణత పొంది 2023 సంవత్సరంలో కస్తూరిభా గాంధీ విద్యాలయాల పరిధిలో సీఆర్టీ తెలుగు సబ్జెక్టులో పని చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో మొదటి ర్యాంకు సాధించి, ప్రస్తుతం కేజీబీవీ నేరడిగొండలో ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్నారు. అలాగే సొనాల గ్రామం నుంచి ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించినందుకు తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుండి ఇంటర్ విద్యార్థులకు సడలింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు నేటి నుండి సమయానికి సంబంధించి సరైన కారణం ఉన్నట్లయితే ఐదు నిమిషాల ఆలస్యంగా కూడా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఒక్క నిమిషం నిబంధన అమల్లో ఉండగా రెండు రోజుల నుండి అక్కడక్కడ విద్యార్థులు ఆలస్యం కావడం ఆత్మహత్య ప్రయత్నం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుండి ఐదు నిమిషాలు ఆలస్యంగా కూడా సెంటర్‌లోకి అనుమతి ఉండనున్నట్లు తెలిపారు. మూడోరోజు జిల్లా వ్యాప్తంగా జనరల్ 4734, ఒకేషనల్ 881 మొత్తం 5615 మంది విద్యార్థులకు గాను జనరల్ 4520, ఒకేషనల్ 802 మంది హాజరయ్యారన్నారు. మొత్తం 293 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 19 కేంద్రాలలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించినట్లు ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు. డెక్ కమిటీ సభ్యులు రెబ్బెన కళాశాల తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డెక్ సభ్యులు రాజయ్య అథియాఖానం పాల్గొన్నారు.

డీపీఓగా భిక్షపతి గౌడ్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా పంచాయతీ అధికారిగా బి.బిక్షపతి గౌడ్ శుక్రవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి డీఎల్పీఓగా ఉన్న ఆయనను ప్రభుత్వం ఆసిఫాబాద్ జిల్లా డీపీఓగా నియమించడంతో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించి పల్లెల ప్రగతికి ప్రత్యేక కార్యచరణలతో ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎల్పీఓలు ఉమర్ హుస్సేన్ పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో వర్గీకరణ సాధిస్తాం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్సీ వర్గీకరణ సాధనలో మాదిగ జాతి సామాజిక ఆర్థిక రాజకీయ విముక్తి కోసం తృణప్రాయంగా ప్రాణాలర్పించిన అమరవీరుల స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణను సాధించుకుంటామని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జగ్జీవన్ రావు విగ్రహ ప్రాంగణం వద్ద అమరవీరులకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం 30 ఏండ్లుగా రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. ఈ పోరాటంలో నేలకొరిగిన వీరులు జాతి కోసం ప్రాణాలు అర్పించి చిరస్మరణీయులుగా మిగిలిపోయారన్నారు. వారి త్యాగాలను వృథా కానివ్వమని తెలిపారు. మాదిగలు తమ జాతి కోసం ఒక వైపు, సమాజం కోసం మరో వైపు ఆలోచన చేసి అనేక ఉద్యమాల్లో పాల్గొని త్యాగాలు చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణను సాధించడమే అమరులకు ఇచ్చే నిజమైన నివాళులని అన్నారు. వర్గీకరణ సాధించడం కోసం జాతి యావత్తు అంకితభావంతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమములో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుంట మహేష్, ఎంఎస్పీ జిల్లా నాయకుడు ఆర్.సాగర్, నాయకులు బొమ్మెన వెంకటేష్, కృష్ణ, రమేష్, బీసీ నాయకులు గాజుల కృష్ణ, రమేష్, వెంకటేష్, సత్తయ్య, పూదారి గోపాల్, గడ్డల మల్లయ్య, కుందారపు ప్రతాప్ పాల్గొన్నారు.

4న పీఎం మోడీ సభను విజయవంతం చేయండి



నవతెలంగాణ-దహెగాం

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుల్లం నారాయణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్ర తిరుపతిగౌడ్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడుతూ మరోసారి దేశంలో మోడీ పాలనను ప్రజలు కోరుకుంటున్నారన్నారు. మొట్టమొదటి సారిగా ఆదిలాబాద్ జిల్లాకేంద్రానికి వస్తున్న ప్రధాని సభలో అందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

31 వరకు పోలీస్ యాక్టు అమలు

నవతెలంగాణ-వాంకిడి

ఈనెల 31వ తేదీ వరకు పోలీస్ యాక్టు 1861 అమల్లో ఉంటుందని ఎస్ఐ సాగర్ తెలిపారు. జిల్లాలో సబ్ డివిజన్ పోలీస్ అధికారి లేదా ఉన్నతాధికారుల నుండి అనుమతిలేకుండా ఎలాంటి పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, నిరసనలు నిర్వహించరాదన్నారు. నిషేధిత ఆయుధాలైన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలలు లాంటివి వాడరాదని, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఉండకూడదని తెలిపారు. అందరు సహకరించాలని కోరారు.

టీఎన్జీఓ తాలూకా యూనిట్ ఎన్నికలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మార్చి నెలలో జిల్లాలోని టీఎన్జీఓ మూడు యూనిట్లకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు లింగాల రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిలో భాగంగా మార్చి 3న సిర్పూర్(టీ) పట్టణంలోని రైతు వేదికలో సిర్పూర్ యూనిట్‌కు సంబంధించి నిర్వహించనున్న ఎన్నికలకు ఎన్నికల అధికారిగా నందారం వ్యవహరించనున్నారని, 5న ఆసిఫాబాద్ యూనిట్ ఎన్నికలు నిర్వహించనుండగా దీనికి ఎన్నికల అధికారిగా వసంత వ్యవహరిస్తారని, 6న జైనూర్ యూనిట్ ఎన్నికలు అక్కడి రైతు వేదికలో నిర్వహించే ఎన్నికలకు మధుకర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారని పేర్కొన్నారు. ప్రతినిధులంతా హాజరై ఎన్నికలు విజయవంతం చేయాలని కోరారు.

6న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ మండల ప్రజా పరిషత్ సాదారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 6న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు చునార్కర్ సువర్ణ ఆదేశాల మేరకు ఈ నెల 6న ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్టు, సమావేశానికి ముందు గత సమావేశంలో తీర్మానించిన అంశాల నివేదికలను ప్రజా ప్రతినిధులకు ప్రతులను అందజేయాలని తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యుడు, వివిధ మండలస్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

పెండింగ్ దరఖాస్తుల పరిశీలన

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ధరణి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలిస్తున్నట్టు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలో కొన్ని రోజుల క్రితం రైతులు భూములకు సంబంధించిన దరఖాస్తులు సుమారు 51 ఉన్నాయని తెలిపారు. వీటిని ఈ నెల 7వ తేదీ వరకు పరిశీలించి పరిష్కారం చేసే విధంగా చూస్తామని, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి
- జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీసీలో పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్, 10వ తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి డీజీపీ, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో వార్షిక పరీక్షల నిర్వహణ, ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఫిబ్రవరి 28 నుండి ఈనెల 19 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు, ఈ నెల 18 నుండి ఏప్రిల్ 2 వరకు 10వ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా జిల్లాల పరిధిలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగే విధంగా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలోనికి మొబైల్, డిజిటల్ పరికరాలు తీసుకువెళ్లడానికి అనుమతి లేదని, గత అనుభవాల దృష్ట్యా కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పరీక్షలు సజావుగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా అవసరమైన రోడ్లలో బస్సులు నడిపించాలని, పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ గ్యారంటీ పథకాలు అందే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలలోని ప్రతి మండలంలో ఎంపీడీఓ కార్యాలయంలో, మున్సిపల్ కార్యాలయంలో అవసరమైన మేర ప్రజా పాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. జిల్లాలో ప్రజా పాలన సేవా కేంద్రాల నిర్వహణ కోసం అవసరమైన మేర డాటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించడంతో పాటు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్ ఇతర సామాగ్రిని సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్, విద్యుత్ శాఖ అధికారి వాసుదేవ్, జిల్లా పరీక్షల సహాయ సంచాలకులు ఉదయ బాబు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, ఏఈ ఫిరోజ్ ఖాన్, జిల్లా పరిషత్ పర్యవేక్షకులు తోటాజీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు అధిగమిస్తాం

- బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాకు సింగరేణి సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సమిష్టి కృషితో అధిగమిస్తామని బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్ అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫిబ్రవరి మాసానికి సంబంధించిన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలను ఆయన వెల్లడించారు. బెల్లంపల్లి ఏరియాలోని గనులు ఫిబ్రవరిలో 2.90 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా 102 శాతంతో 2.97 మిలియన్ టన్నులు బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను 32.50 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా ఇప్పటికీ ఫిబ్రవరి మాసానికి 37.82 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. రానున్న మార్చి నెలకు అనుకూలంగా సమిష్టి కృషితో బొగ్గు ఉత్పత్తి 40 శాతానికిపైన సాధించుకోవాల్సి ఉంటుందని, కార్మికులు, అధికారులు, సూపర్‌వైజర్‌ల సహకారంతో 40 శాతం పైచిలుకు సాధించే అవకాశం ఉందన్నారు. సింగరేణి హైస్కూల్ వార్షిక వేడుకలను ఘనంగా జరుపుకున్నామన్నారు. సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డ్స్ 1333 దరఖాస్తులు స్వీకరించగా 1301 దరఖాస్తులు ఆమోదించినట్టు తెలిపారు. అందులో జారీ చేసిన మెడికల్ కార్డ్స్ 1267 జారీ చేసినట్టు, హెచ్‌బీఎల్ఐఆర్ఎస్ స్వీకరించిన దరఖాస్తులు 314కు, అందులో అనుమతిపొందిన 305, చెల్లించిన ఉద్యోగుల సంఖ్య 166, కార్పొరేట్‌కు మెడికల్ బోర్డుకు హాజరైన ఉద్యోగుల సంఖ్య 647, మెడికల్ బోర్డు ద్వారా అనఫిట్ అయిన ఉద్యోగులు 351, సర్వీసులో ఉన్నప్పుడు చనిపోయిన ఉద్యోగులు 23 మొత్తం తొలగించినబడిన ఉద్యోగులు 374, వారసత్వ ఉద్యోగం పొందిన వారు 395, ఇతర బెనిఫిట్స్ పొందిన వారు 25 మంది, మొత్తం వారసత్వ ఉద్యోగాలు, తదితర బెనిఫిట్స్ పొందిన పొందిన ఉద్యోగులు 320, పీడీఎస్ ఉద్యోగుల వివరాలు మొత్తం ఉద్యోగాలు 154, ఉద్యోగాలు పొందిన వారు 131 మిగిలిన వారు 23 మంది, బొగ్గు ఉత్పత్తితో పాటు సంక్షేమ పథకాలు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉజ్వల్ కుమార్ బెహరా, ఐఈడీ పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో బొగ్గు ఉత్పత్తి వివరాలను వెల్లడిస్తున్న జీఎం నరేందర్

ఆటల్లో గెలుపోటములు సహజం : ఎస్పీ సురేష్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ సురేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన పోలీస్ సాయుధ బలగాల బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొని వారితో ఆడి విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కోసం నిత్యజీవితంలో ఆటలు అలవర్చుకోవాలన్నారు. పోలీసులు విధుల్లో ఒత్తిడి నుంచి బయటపడడానికి, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి క్రీడాలు తోడ్పడతాయన్నారు. పోలీసులు ఒత్తిడి, అలసట లోనవకుండా, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంచడానికి క్రీడాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సింగిల్స్ విభాగంలో మొత్తం 20 మంది పాల్గొనగా, కే.వెంకటేష్ విజేతగా, ఆర్ఎస్ఐ సందీప్ రన్నర్ అప్‌గా నిలిచారు. బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొనగా కే.వెంకటేష్, ఎస్.వెంకటేష్ విజేతలుగా, ఆర్ఎస్ఐ కిరణ్, బి.శశి రన్నర్ అప్‌గా నిలిచారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్, ఆర్ఐ పెద్దన్న, అంజన్న, షేక్ నాగుల్ మీర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు అన్ని విధాల అండగా ఉంటాం

మహిళలు సమస్యలపై నిర్భయంగా సంప్రదించవచ్చని అన్ని విధాల వారి సమస్యలు పరిష్కరించడానికి అండగా ఉంటామని ఎస్పీ కే సురేష్ కుమార్ తెలిపారు. మహిళల రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలకు సంబంధించి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు గురైతే జిల్లా షీ టీం మొబైల్ నంబర్.87126 70564 లేదా డయల్ 100ను సంప్రదించాలని, మహిళల రక్షణ కోసం షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవీటిజింగ్, ఫోక్సో, షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కల్పించామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి నెలలో షీటీంకు 03, 66 హాట్ స్పాట్స్ విజిట్ చేస్తూ, 23 అవగాహన కార్యక్రమాలు ద్వారా విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. చిన్న పిల్లల రక్షణ విషయంలో పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. మహిళలు ఫేస్ బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫొటోలు, వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరుగా సంప్రదించలేని వారు 87126 70564, లేదా డయల్ 100కు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉపేందర్



నవతెలంగాణ-రెబ్బెన

భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని గోలేటిలో కమ్యూనిటీహాలులో మండల భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వడ్డూరి లింగయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు బోగె ఉపేందర్ మాట్లాడుతూ ప్రస్తుతం భవన నిర్మాణంలో ప్రభుత్వం కడుతున్న ఒక్క శాతం సెస్‌ను రెండు శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. 55 ఏండ్ల వయసుపై బడిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని, కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులకు సభ్యులుగా నియమించాలన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్లను, ఇతర బెనిఫిట్ బకాయిలను వెంటనే ఇవ్వాలన్నారు. కార్మికుల అడ్డాల వద్ద మౌళిక వసతులలతో షెల్టర్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన భవన నిర్మాణ కార్మిక కుటుంబానికి రూ.10 లక్షలు, సహజ మరణం పొందితే రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, పెండ్లి కానుకగా రూ.ఒక లక్షకు పెంచాలని, పిల్లల చదువుకు స్కాలర్‌షిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలని, నూతన రేషన్‌కార్డులు వెంటనే జారీ చేయాలన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల్లో నిర్మాణ కార్మికులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, నెలకు రూ.ఆరు వేల పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించి క్లెమ్స్ నిధులు విడుదల చేయాలన్నారు. వెటర్నరీ ఆస్పత్రి ఖర్చుల కోసం రూ.50 వేలు పెంచాలని డిమాండ్ చేశారు.

జోడువాగుపై నూతన వంతెన నిర్మించాలి



నవతెలంగాణ-జైపూర్

భీమారం-కిష్టంపేట్ మధ్యన శిథిలమైన జోడువాగుపై నూతన వంతెన నిర్మించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బోడెంకి చందు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి శిథిలావస్థలో గల జోడువాగు వంతెన, వంతెనకు ఇరువైపులా చెడిపోయిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజామాబాద్-జగ్దల్‌పూర్ జాతీయ రహదారి 363లో గల జోడువాగు వంతెన ఇరుకుగా ఉండటంతో పాటు ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదమున్నందున ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి స్పందించాలని డిమాండ్ చేశారు. వంతెనకు ఇరువైపులా రోడ్డు చెడిపోయి గుంతలమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న జోడువాగు వంతెన నిర్మాణానికి కేంద్ర అటవీశాఖ నుండి అనుమతులు లభించాల్సి ఉందన్నారు. దీనిపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే వెంటనే స్పందించాలని, కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులు త్వరగా అందేవిధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉమారాణి, సమ్మక్క, నాగజ్యోతి, యామిని, సరిత, నాగేష్, కుమార్, సత్తన్న, లింగన్న పాల్గొన్నారు.

వన్యప్రాణులకు హాని కలిగించొద్దు

- డీఎఫ్ఓ నీరజ్‌కుమార్ ఫెబ్రివాల్



నవతెలంగాణ-దహెగాం

వన్యప్రాణులకు హాని కలిగించొద్దని డీఎఫ్ఓ నీరజ్‌కుమార్ ఫెబ్రివాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని గిరవెల్లి, లోహ గ్రామాల్లో వన్యప్రాణుల రక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే కొంచవెల్లి, గిరవెల్లిలో గడ్డి మైదానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులతో పాటు అటవీ జంతువులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అటవీ జంతువుల రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని, ప్రత్యేక చట్టాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరైన అటవీ జంతువులను వేటాడిన, వాటికి ఏ రకమైన హాని తలపెట్టిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు అమరిస్తే నాన్ బెయిలేబుల్ కేసులను నమోదు చేయడం జరుగుతుందన్నారు. అలాగే అటవీ సంపదకు నష్టం కలిగించిన చట్టపరంగా శిక్షార్హులవుతారన్నారు. అటవీ జంతువులకు నీటి తొట్లు ఏర్పాటు చేస్తామని, మేత కోసం గడ్డి మైదానాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ నిజామొద్దీన్, డీఆర్ఓ శ్రీధరాచారి, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు బాబు, రవి, ఎఫ్‌బీఓలు మధూకర్, సద్దాం పాల్గొన్నారు.

16కు జాతీయ లోక్ అదాలత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 9న నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఈ నెల 16వ తేదీకి వాయిదా వేయడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎస్. గోవర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 8, 9, 10 తేదీలలో వరుసగా ప్రభుత్వ సెలవులుండడంతో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఈ నెల 16కి వాయిదా వేయడం జరిగిందని తెలిపారు.

రేపటి పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-వాంకిడి

ఈ నెల మూడున నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని డాక్టర్ ఉప్రె వినయ్ తెలిపారు. 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు ప్రతి ఒక్కరు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. ప్రతి ఒక్కరు సహకరించి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశాలకు చివరి గడువు

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో వంద సీట్లు, 7, 8, 9, 10 తరగతలో ఖాళీగా ఉన్న సీట్లకు అడ్మిషన్ల కోసం మార్చి 2 చివరి అవకాశమని, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్యా భోదన ఉచితంగా ఉంటుందని, అన్ని రకాల సదుపాయాలు, వసతులు ఉంటాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రహదారికి ఇరువైపులా వాహనాలు ప్రయాణికులకు ఇబ్బందులు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్‌లోని కొత్త రోడ్డు మద్యం దుకాణం ఎదుట రోడ్డుకు ఇరువైపులా ఇష్టారాజ్యాంగ వాహనాలను నిలుపుతున్నారు. ఈ రహదారిలో ప్రయాణించే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ దారిలో నిత్యం గోదావరిఖని నుండి బెల్లంపల్లికి ఆర్టీసీ బస్సు నడుస్తుంది. మద్యం దుకాణం నివాసాల మధ్య ఉండడంతో మహిళలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శనివారం | మార్చి 02, 2024 | www.navatelangana.com

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

నవతెలంగాణ-మందమర్రి



ప్రజా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఒర్రెగడ్డ జెడ్పీ హై స్కూల్‌లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ అజీమోద్దీన్ మాట్లాడుతూ తమవంతుగా ప్రజలకు సహాయం చేయాలనే దృక్పథంతో దాతలు సహకరిస్తున్నారని తెలిపారు. ప్రజాసేవ చేస్తున్న వెల్ఫేర్ సొసైటీ సభ్యులను పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి పట్టణ అధ్యక్షుడు నదిపట రాజు, జిల్లా కార్యదర్శి గాండ్ల సంజీవ్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు ఒరం కవి రాజు, ఎండీ జావిద్ పాషా, మామిడి అజయ్, చరణ్ పాల్గొన్నారు.

కూలీలందరికి పని కలిపించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని కూలీలందరికి ఉపాధిహామీలో పని కల్పించాలని ఎంపీడీఓ సరోజ అన్నారు. శుక్రవారం మండలంలోని రంగపేట, హనుమంతుపల్లి, చందారం గ్రామపంచాయతీలలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో పని కలిపించి రోజుకు రూ.272 సగటు వేతనం అందించాలని సూచించారు. ఉపాధిహామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశాన్ని, నర్సరీలను, అంగన్‌వాడీ సెంటర్స్, ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వెంకటరమణ, టెక్నికల్ అసిస్టెంట్ బూసిరాజు రాజన్న, ఆయా గ్రామాల కార్యదర్శులు ప్రదీప్, మౌనిక, శ్రీలత ఉన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్, 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో వార్షిక పరీక్షల నిర్వహణ, ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంటర్మీడియట్, 10వ తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. మొబైల్ ఫోన్, డిజిటల్ పరికరాలు అనుమతించవద్దన్నారు. ప్రభుత్వం అందిస్తున్న గ్యారంటీ పథకాలను రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

ధరణిలో నమోదైన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి పరిష్కరించేందుకు ఈ నెల 9 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలో నమోదైన భూ సమస్యలపై వివిధ దశలలో విచారించి పరిష్కరించేందుకు ఈ నెల 9 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల అధికారులు తమ పరిధిలో నమోదైన భూ సంబంధిత దరఖాస్తులు, ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో సమగ్ర విచారణ జరిపి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఆర్డీఓ పరిధిలో టీఎం 7లో పాస్ పుస్తకం లేకుండా నాలా కోసం దరఖాస్తు, టీఎం 16లో సేకరించిన భూముల సంబంధిత ఫిర్యాదులు, టీఎం 20లో ఎస్ఆర్ఐ పోర్టల్, టీఎం 22లో సంస్థల కోసం పట్టాదారు పాస్‌పుస్తకం, టీఎం 26లో కోర్టు కేసుల సమాచారం, టీఎం 33లో పట్టాదార్ పాస్ పుస్తకంలో ఖాతా, పేరు, మిస్సింగ్ సర్వే నం, భూ రకం, విస్తీర్ణం, భూ వినియోగం ఇతరత్రా వివరాల సవరణ అంశాలు ఉంటాయని తెలిపారు. తహసీల్దార్ పరిధిలో టీఎం 4 అసైన్డ్ భూముల వారసత్వం కోసం దరఖాస్తు, టీఎం10లో జీపీఏ, ఎస్‌పీఏ కోసం దరఖాస్తులు, టీఎం 14లో ఆధార్ వివరాలు సక్రమంగా లేని నిర్దిష్ట భూ విషయాలపై దరఖాస్తు, టీఎం 32లో ఖాతా కలుపుట సంబంధిత అంశాలు ఉంటాయని తెలిపారు. టీఎం 24లో న్యాయస్థానం తీర్పు ద్వారా పట్టాదార్ పాసుపుస్తకం జారీ, టీఎం 15లో నిషేధిత భూముల సంబంధిత ఫిర్యాదులు, టీఎం 23లో సెమి-అర్బన్ ప్రాంతంలో పట్టాదారు పాస్‌పుస్తకం దరఖాస్తు, టీఎం 31లో నివాస స్థలాలుగా చూపిన ప్రాంతాలలో పాస్ పుస్తకం, నాలా సంబంధిత సమస్యలు, టీఎం 3లో ముటేషన్ దరఖాస్తు, టీఎం 4 పట్టాదార్ పాస్ పుస్తకంతో కాని, లేకుండా కాని అసైన్డ్ భూముల వారసత్వం కోసం దరఖాస్తు సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్ తుది ఆమోదం ఉంటుందన్నారు. ధరణిలో నమోదైన భూ సమస్యల పరిష్కారానికి జిల్లాలోని 18 మండలాలలోని ప్రతి తహసీల్దార్ పరిధిలో 2,3 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాల ద్వారా దరఖాస్తు సమయంలో జతపరిచిన దస్తావేజులు, సంబంధిత ధృవపత్రాలను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పరిష్కరించిన వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధరణిలో వివిధ మాడ్యూల్స్ సంబంధిత అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ, తహసీల్దార్లు, డిప్యూటి తహసీల్దార్లు, రెవెన్యూ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు అధికారుల ఆదేశాలను అనుసరిస్తూ గ్రామాల వారీగా పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ వనజా రెడ్డి తెలిపారు. మండల పరిధిలో వివిధ గ్రామాల నుండి మీ సేవ ద్వార భూ సమస్యల పరిష్కారం కోసం 600 ధరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించామన్నారు. తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో రెండు బృందాలు శుక్రవారం నుండి ధరఖాస్తుల పరిశీలన మొదలైందని తెలిపారు. ధరఖాస్తులను క్రోడీకరించి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యను పరిష్కరించడం కోసం రెవెన్యూ రికార్డులను పరిశీలించడం, అవసరమైతే స్థల పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. పెడింగ్ ధరఖాస్తుల్లో గల అంశాలు, పరిష్కరంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించడం కోసం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులన్నింటిని పరిష్కరించుటకు కృషి చేస్తున్నామని తెలిపారు.

ధరఖాస్తుల పరిశీలనలో నిమగ్నమైన అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూసమస్యల పరిష్కారం కోసం వారం రోజుల గడువు విధించిన నేపధ్యంలో శుక్రవారం భీమారం తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ ధరఖాస్తులను పరిశీలిస్తున్నారు. తహసీల్దార్ సదానందంతో పాటు డిప్యూటీ తహసీల్దార్ క్రిష్ణ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాజేశ్వరి రైతుల నుండి అందిన ధరఖాస్తులను పరిశీలించారు. భీమారం మండల పరిధిలో గల వివిధ గ్రామాలకు సంబంధించి 257 ధరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-వేమనపల్లి

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని జక్కేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..జక్కేపల్లి గ్రామానికి చెందిన పోర్తెట్టి అశోక్ (38) మధ్యానికి బానిసై, కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చెన్నూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరిలించారు. అక్కడి నుంచి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. భార్య అనసూర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఏఎస్ఐ నరేష్ తెలిపారు. మృతునికి నలుగురు పిల్లలున్నారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-నస్పూర్

పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీడబ్ల్యూఓ చిన్నయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భానుమతి, రాజమణి మాట్లాడుతూ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం, కాంట్రాక్టర్ ద్వారా సరఫరా అయ్యే సరుకులు పూర్తిగా సమయానికి రావడం లేదన్నారు. అదే విధంగా గత కొన్ని సంవత్సరాలుగా ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లులు, టీఏ, డీఏలు ప్రభుత్వం చెల్లించడం లేదని, దీనితో కేంద్రాల నిర్వాహణ భారంగా మారుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏ విధంగా ఇస్తున్నారో ఆ విధంగా వేసవి సెలవులు, ఒంటి పూట బడులు ఇవ్వాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అర్హులైన అంగన్‌వాడీ ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విరోనిక, అనురాధ, పద్మావతి, భాగ్యలక్ష్మి, మహేశ్వరీ, సంగీత పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌ను ఇంజనీరింగ్ కళాశాలగా మార్చాలి



నవ తెలంగాణ-జన్నారం

ఉట్నూర్ పట్టణంలోని గిరిజన పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా మార్చాలని తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్ర చైర్మెన్ మేకల అక్షయ్ కుమార్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కలిసి వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలోని విద్యార్థులకు మేలు జరిగేలా పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీర్ కళాశాలగా మార్చి ఆధునిక విద్య కోర్సులను ప్రవేశపెట్టాలని ఎమ్మెల్యేను కోరారు. కళాశాల విద్యార్థులకు డిప్లొమా కోర్సు పూర్తి అయ్యేంతవరకూ ఏవిధమైన ఫీజుల భారాలు లేకుండా ఉచిత విద్య, పుస్తకాలు, దుస్తులు, విద్యాభ్యాసం, వసతికి అవసరమైన కనీస మౌళిక వస్తువులు సామాగ్రి ఉచితంగా అందించాలన్నారు. ఫీజుల భారం లేకుండా అడ్మిషన్లకు అవకాశం ఇచ్చి గిరిజన విద్యార్థులకు సాంకేతిక విద్య చదివే అవకాశాన్ని కల్పించి ఆదుకోవాలన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలో పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఐఏఎస్ నరహరి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ కమిషనర్ అండ్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని దేవున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వేముల రాజగురువయ్య, బండి రాజలింగు, బొప్పు కిషన్, పోతు మహేష్, కట్ల శంకర్, హన్మండ్ల శంకర్, హన్మండ్ల రాంచందర్, జంజిరాల కాంతయ్య, రవి, రాము, కట్ల శ్రీనివాస్, గాదాసు చుక్కన్న, గాదాసు నరేష్, అంకం రమేష్, అంకం వెంకటేష్ పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ నాయకుల ధర్నా



నవతెలంగాణ-నస్పూర్

బెల్లంపల్లి పట్టణంలో అనుమతులు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో గత సంవత్సరం నుండి శ్రీరామ స్కూల్ పేరు మీద శ్రీ చైతన్య పాఠశాల నిర్వహిస్తూ ప్రాంత విద్యార్థులను, తండ్రులను మోసం చేస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. విద్యార్థులు ప్రయాణించే పాఠశాల బస్సుల పైన, వారు ధరించే బెల్ట్, పుస్తకాలు, పరీక్ష పత్రాలు, కరపత్రాలపైన శ్రీ చైతన్య స్కూల్ అనే ఉండడం గమనించవచ్చని తెలిపారు. శ్రీ చైతన్య పాఠశాల పేరు మీద ఎలాంటి అనుమతులు లేవని, గతంలో శ్రీరామ పాఠశాల అనుమతులతోనే పాఠశాలను కొనసాగిస్తున్నారని అన్నారు. ఆ పాఠశాలపైన చర్యలు తీసుకోవాలని ఎంఈఓ, డీఈఓకు గత సంవత్సరం నుంచి అనేక సార్లు విన్నవించుకున్న వారిపైన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యుడు అభినవ్ పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళ్లు



నవతెలంగాణ-నస్పూర్

ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలను జాతి భవిష్యత్తు కోసం త్యాగం చేసిన మాదిగల అమరవీరులకు శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవనంలో నివాళులర్పించారు. మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకోని అమరు చిత్రపటాలకు పుష్పాంజలి సమర్పించి వారి త్యాగలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్ మాదిగ మాట్లాడుతూ మాదిగల హక్కుల కోసం పోరాటం చేసి అమరులైన మాదిగల స్మారకార్థం మాదిగ అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో అమరవీరుల సాక్షిగా త్వరలోనే ఎస్సీ వర్గీకరణ సాధించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జలంపల్లి శ్రీనివాస్ మాదిగ, నాయకులు గద్దల బానయ్య మాదిగ, మొగిలి చంద్రయ్య మాదిగ, జైపూర్ మండల అధ్యక్షులు రామగిరి రాము మాదిగ, సీనియర్ నాయకులు పెరుక సత్యనారాయణ, భోగె మధు, ఇనుముల మొగిలి, ఎనగందుల సారయ్య, చెరుకు సంపత్, లింగంపల్లి శేఖర్, మెతే కాంతయ్య మాదిగ,లింగంపల్లి సతీష్ మాదిగ,మధు మాదిగ, రామగిరి వేణుమాధవ్ మాదిగ పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగాల్లో స్థానికులకు అన్యాయం

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌లో స్థానికులకు అన్యాయం జరుగుతుందని నిరుద్యోగులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకటన విడుదల చేసి కొత్త జిల్లాలను పరిగణలోకి తీసుకొని స్థానికులను ఎంపిక చేయకుండా, ఉమ్మడి జిల్లాలను పరిగణలోకి తీసుకొని సింగరేణికి సంబంధం లేని జిల్లాలను కూడా ప్రకటించడం స్థానికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించి 33 జిల్లాలను పరివణలోకి తీసుకొని జిల్లావ్యాప్తంగా ఉద్యోగాలను ప్రకటించిందని, దాని ప్రకారంగానే సింగరేణి జిల్లాలైన మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి కొత్తగూడెం జిల్లాల వారిని స్థానికులుగా గుర్తించాలన్నారు. స్థానిక నిరుద్యోగులకు అన్యాయం జరగకుండా ఆదుకోవాలని సింగరేణి యూనియన్ నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరారు.

విద్యారంగంపై పాలకుల చిన్నచూపు

నవతెలంగాణ-హాజీపూర్



విద్యారంగంపై పాలకులు చిన్నచూపు చూస్తున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి జయకృష్ణ అన్నారు. శుక్రవారం మంచిర్యాలలోని మార్క్స్ భవన్‌లో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి రెడ్డి చరణ్ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తులుగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీకాంత్, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి జయ కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు కనీస బడ్జెట్ కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్ లేక విద్యార్థులే పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా కేంద్రంలో ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి విద్యార్థి తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ అనుమతులు లేకుండా పాఠశాలలు నడుపుతున్న డీఈఓ స్పందించడం లేదని ఆరోపించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు అండగా ఉంటున్న డీఈఓని తొలగించాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా శ్రీ చైతన్య పాఠశాలలు అనుమతులు లేకుండా క్యాంపస్ నిర్వహించి ప్రచారాలు కొనసాగిస్తూ అడ్మిషన్లు తీసుకుంటున్నారన్నారు. ఈ ప్రచారాలను నమ్మి విద్యార్థి తల్లిదండ్రులు ఎవరు కూడా విద్యార్థులను అడ్మిషన్లు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు ఏ. రాహుల్, టి.రాహుల్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు జతిక్, లక్ష్మణ్ చిప్పకుర్తి శ్రీనివాస్, చేరాల వంశీ, బచ్చుల ప్రవీణ్, సల్మాన్, రాజేష్, క్రాంతి, గోపాల్, అభి పాల్గొన్నారు.

ఇద్దరి నిందితులకు జరిమానా

నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట న్యాయస్థానం ఇద్దరు నిందితులకు జరిమానా విధించిందని ఎస్ఐ పి. చంద్రకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన అప్పని లింగయ్య పొలంలోకి అదే గ్రామానికి చెందిన సూరమల్ల చంద్రయ్య, సురమల్ల దుర్గయ్య అనే ఇద్దరు నిందితులు 2018 ఆగస్టు 22న పొలంను ధ్వంసం చేయడంతో పాటు లింగయ్యపై దాడి చేశారు. బాదితుడు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఆది మధుసుదన్ రావు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పర్చగా కోర్టు పీసీ సత్యనారాయణ సాక్షులను ప్రవేశపెట్టారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ షాహిన్ సుల్తానా సాక్షులను విచారించడంతో నేరం ఋజువు కాగా న్యాయమూర్తి (జూనియర్ సివిల్ జడ్జ్) మహ్మద్ అసదుల్లా షరీఫ్ నిందుతులైన సూరమల్ల చంద్రయ్య వయస్సు 70సంవత్సరాలు ఉండటంతో వయస్సును పరిగణలోకి తీసుకుని రూ.200 జరిమాన, అదే విధంగా సూరమల్ల దుర్గయ్యకు ఒక వెయ్యి రూపాయల జరిమానా విధించారని తెలిపారు.

సదరం స్లాట్ బుకింగ్ అవకాశం కల్పించాలి

నవతెలంగాణ-జన్నారం



జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదరం స్లాట్ బుకింగ్‌లో వికలాంగులకు 300 మందికి అవకాశం కల్పించాలని మండల ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు అబ్దుల్లా అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అంగవైకల్యం ఉన్నవారికి జిల్లాలో అన్ని మండలాల్లో ఈ సేవా కేంద్రాల్లో 100 మందికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. దానిని 300 మందికి పెంచితే సదరం స్లాట్ బుకింగ్‌లో ఎక్కువ అంగవైకల్యం ఉన్నవారికి అవకాశం దక్కుతుందన్నారు. సమస్యను ప్రభుత్వం, అధికారులు గుర్తించాలన్నారు.

నవతెలంగాణ
ఆదిలాబాద్
శనివారం | మార్చి 02, 2024 | www.navatelangana.com

నిర్దేశించిన లక్ష్యాన్ని ముందుగానే సాధించాం

నవతెలంగాణ-నస్పూర్

2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆర్కే 6 గనికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని 30 రోజుల ముందుగానే సాధించినట్లు గని మేనేజర్ తిరుపతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీఎం సంజీవరెడ్డి, ఏజెంట్ వెంకటేశ్వర్ రెడ్డి వార్షిక లక్ష్యాన్ని అధిగమించినందుకు గని అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. గని ఉద్యోగుల సమిష్టి కృషి పనిపై స్ఫూర్తి ఇలాగే కొనసాగాలని సూచించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరములో ఆర్. కే-6 గనికి కెటాయించిన ఉత్పత్తి లక్ష్యం 1,80,000 టన్నులు శుక్రవారం నాటికి 30 రోజుల ముందుగానే సాధించడం జరిగిందన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకతకు తోడ్పాటునందించిన ఆర్.కే-6 గని ఉద్యోగులకు, టెక్నీషియన్లకు, సూపర్‌వైజర్లకు, ఆఫీసు సిబ్బందికి, అధికారులకు, యూనియన్ నాయకులకు, కోల్ ట్రాన్స్‌పోర్ట్ సిబ్బందికి అలాగే పరోక్షంగా తోడ్పాటునందించిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు సీట్లను పంపిణీ చేశారు.

పాఠశాల విద్యార్థులకు కుర్చీలు, ఫ్యాన్లు పంపిణీ

నవతెలంగాణ-జైపూర్



మండలం ముదిగుంట ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కుర్చీలు, ఫ్యాన్లు పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాలను సంధర్శించిన అటవీ అభివృద్ధి సంస్థ డివిజన్ మేనేజర్ శ్రావణీతో పాటు మేనేజర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమం ద్వార విద్యార్థుల అవసరార్థం కుర్చీలు, ఫ్యాన్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రేంజ్-1 లక్ష్మన్, రేంజ్-2 సునిత, బెల్లంపల్లి రేంజ్ జూనియర్ అసిస్టెంట్ రవికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని అన్నారు. మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆర్థిక, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం రిసెప్షన్, మెన్ బ్యారక్, టెక్నికల్ రూమ్‌లను పరిశీలించి, పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ సిబ్బంది విధులు, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దిలావర్‌పూర్ ఎస్సై సుమాంజలి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇరు కుటుంబాలకు నరేష్ జాదవ్ పరామర్శ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గిరిజన ఇంటర్ విద్యార్థి పరీక్ష రాయడానికి ఆలస్యం కావడంతో పరీక్ష రాయలేదన్న మనస్థాపంతో సాత్నాల ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబాన్ని ఆదిలాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఏఐసీసీ సభ్యులు డాక్టర్ నరేష్ జాదవ్ పరామర్శించారు. శుక్రవారం జైనథ్ మండలం మాంగర్ల గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా అదే గ్రామానికి చెందిన ఏడో తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని మహేశ్వరి అనారోగ్యంతో ఈ మధ్య చనిపోయారు. ఆ రెండు కుటుంబాలని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ప్రధాని బహిరంగ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ప్రధాని నరేంద్ర మోడీ 4న మొదటిసారిగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి పార్లమెంట్ ఎన్నికల సమావేశానికి వస్తున్నట్టు బీజేపీ మండలాధ్యక్షులు పొలాస గోవర్ధన్ తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల నాయకులు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మెడిసెమ రాజు, మండల ఎంపీపీ పద్మ రమేష్, చందురెడ్డి, బీజేపీ కార్యకర్తలు, యూత్ అధ్యక్షులు, మండల జనరల్ సెక్రటరీ ఆలూరు రాజు, ఉపాధ్యక్షులు నాగుల లింగం, మహిళా అధ్యక్షులు స్వప్న, ఏలేశ్వర్ గంగాధర్, సుమన్, గంగాధర్, శ్రీనివాస్, రాకేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని తేజపూర్ గ్రామంలో రూ.20లక్షల నిధులతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధికి పార్టీలకతీతంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఆడే వసంత్, బ్లాక్ ప్రెసిడెంట్ అల్లూరి ప్రఫుల్ చందర్‌రెడ్డి, బోథ్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, సీనియర్ నాయకులు ఏలేటి రాజారెడ్డి, ముత్యాల పోతన్న, నానిరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

గెలిచిన బహుమానం ఆలయానికి వితరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అంజనీపుత్ర ఎస్టేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో బండల నాగపూర్ జట్టు విజేతగా నిలిచింది. ఆ జట్టు కెప్టెన్ షరీఫ్, వైస్ కెప్టెన్ రమాకాంత్ సంస్థ నుంచి రూ.50 వేల నగదును అందుకున్నారు. అయితే వారు గెలిచిన నగదును మైసమ్మ గుడి నిర్మాణానికి అందించాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామ పెద్దలు శ్రీధర్‌రెడ్డి, కిష్టారెడ్డి, గంగుల వెంకన్నలకు ఆ నగదును అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న అంజనీపుత్ర ఎస్టేట్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ చైర్మెన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్లు పిల్లి రవి, గుర్రాల కిరణ్, పోటీల నిర్వాహకుడు జనగం మహేష్ జట్టు సభ్యులను అభినందించారు. యువకులల్లో ఆధ్యాత్మిక భావన రావడం హర్షణీయమని కొనియాడారు.

బహిరంగ సభ సన్నాహక సమావేశం

నవతెలంగాణ-ఉట్నూర్

భారత ప్రధాని నరేంద్ర మోడీ 4న ఆదిలాబాద్ జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంగా ప్రజలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రాథోడ్ రమేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సేవాదాస్ నగర్‌లో మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ నివాసంలో బీజేపీ పార్టీ కార్యకర్తలతో సన్నాక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాథోడ్ రమేష్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఆదిలాబాద్‌కు రానున్న సందర్భంగా సభ విజయవంతం చేయాలని అన్నారు. సభకు ప్రతి గ్రామం నుంచి వంద మందికి మించకుండా ప్రజలను తీసుకొని రావాలని కార్యకర్తలను కోరారు. సభకు విచ్చేయడానికి ప్రజలకు బస్సును ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల అధ్యక్షులు, వివిధ శాఖల మోర్చా అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

నవతెలంగాణ-నిర్మల్



నిర్మల్‌లోని ప్రభుత్వ భూములను గత పాలకులు అన్యాక్రాంతం చేశారని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత పాలకులు ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేశారని అన్నారు. దీనిపై గతంలో చెప్పినట్టుగా ఆధారాలతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా మన్నారు. వాస్తవాలను, ఆధారాలు చూసి, పరిశీలించి అధికారులే విస్తుపోయారని అన్నారు. ప్రభుత్వ భూమిలోనే ప్రయివేట్ సంస్థ డీమార్ట్ నిర్మాణం చేస్తున్నారని విమర్శించారు. సర్వే నెం.256 ప్రభుత్వ భూమి, ఇందులో డీమార్ట్‌కు అనుమతిచ్చారని తెలిపారు. డీమార్ట్ భూమి, అనుమతులపై కలెక్టర్ విచారణ కొనసాగుతోందని, విజిలెన్స్ ఎంక్వైరీ చేసి, ల్యాండ్ గ్రాబింగ్ కింద చట్ట పరమైన చర్యలు ఉంటాయని అన్నారు. బాధ్యులు ఎవరైనా కటకటల్లోకి వెళ్లాల్సిందేనని వెల్లడించారు. నిర్మల్ చుట్టుపక్కల గ్రామాల్లో డీ1 పట్టాల పేరుతో దోపిడిని మాజీ మంత్రి ఇంద్రకరణ్ హయంలోనే 350 కొత్త పట్టాలు ఏర్పడ్డాయని అన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో దాదాపు 3వేల ఎకరాల భూమి బడా నాయకులు కాజేశారని విమర్శించారు. 3వేల ఎకరాల్లో ఏడు, ఎనిమిది వందలే అసలైన డీ 1 పట్టాలు మిగతా 2వేల పైచీలుకు డీ1 పట్టాలు బోగస్ పేర్లు మీద తీసుకున్నారని విమర్శించారు. గతంలో చెప్పినట్లే ప్రభుత్వ భూములు కాపాడి పేదలకు ఇస్తామని అన్నారు. డీ1 పట్టాల భూముల దందాలో ఎంతటివారున్న చర్యలు తప్పవని అన్నారు. దేవాలయాల భూములను ఓవర్గం కబ్జాచేసినా గత పాలకులు ఏమి అనలేదని, రాష్ట్రంలో దేవాలయాల భూములను కబ్జాచేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ఆలయాల భూముల పరిరక్షణ కోసం రాష్ట్ర వాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. పట్టణంలో దివ్యాగార్డెన్, వెంచర్స్‌లలోగాని ప్రభుత్వం భూములు ఉంటే చర్యలు తప్పవని అన్నారు. బాధ్యులేవరైనా చర్యలు తప్పవని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు రావుల రాంనాథ్, నాయకులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న మోడీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 4న ప్రధాని నరేంద్ర మోడీ ఆదిలాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు ఎమ్మెల్యే పాయల శంకర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 4న ఉదయం 10 గంటలకు నరేంద్ర మోడీ అధికారిక కార్యక్రమాలు, బహిరంగ సభ ఉంటుందని అన్నారు. ఆదిలాబాద్ బేల మహారాష్ట్ర వైపు వెళ్తున్న రహదారిని అభివృద్ధి పరిచేందుకు దాదాపు నాలుగు వందల యాభై కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారన్నారు. ఈ పనులకు ఆయన భూమిపూజ చేస్తున్నారని తెలిపారు. అలాగే పట్టణంలో మౌలిక సదుపాయాలు అండర్ గ్రౌండ్ మురుగునీటి పారుదల, మంచినీటి వ్యవస్థ వంటి వాటికి అమృత్ పథకం కింద రూ.250 కోట్లను మంజూరు చేసి, ఆ పనులకు కూడా శంకుస్థాపన చేస్తున్నారని అన్నారు. అనంతరం 10 గంటలకు స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో భారీ బహిరంగ సభ ఉంటుందని అన్నారు. ఈ సభకు మంత్రులు నాయకులు వస్తున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ వస్తున్న తరుణంలో జిల్లాకు పలు వరాలు ఇచ్చే అవకాశం ఉందని అన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్టును మంజూరు. అదేవిధంగా ఆసియాలోనే అతిపెద్ద కాటన్ మార్కెట్ అయిన ఆదిలాబాద్‌కు టెక్స్‌టైల్ పార్కును ప్రకటించే అవకాశం ఉందని అన్నారు. గత ప్రభుత్వాల కారణంగా నాయకుల అలసత్వం కారణంగా ఆదిలాబాద్‌కు రావాల్సిన టెక్స్‌టైల్ పార్క్ వేరే జిల్లాలకు తరలిపోయిందని అన్నారు. ఎయిర్‌పోర్ట్ విషయమై ప్రస్తుత ముఖ్యమంత్రితో మాట్లాడటం జరిగిందని ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. పలు సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులకు మంజూరు కూడా లభించే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు అంకత్ రమేష్, ఆదినాథ్, లాల మున్నా, చిలుకూరి జ్యోతిరెడ్డి, ఆకుల ప్రవీణ్, జోగు రవి, మహేందర్, రఘుపతి, కృష్ణ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు..

రోజుకు 2.34 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాల్సిందే..!

- ఏరియా జీఎంలో సీఎండీ బలరామ్ నాయక్

నవతెలంగాణ-జైపూర్

ఈ ఆర్థిక సంవత్సరంలో చివరి నెల అయినందున నిర్దేషిత లక్ష్య సాధన కోసం ప్రతి రోజు 2.34 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి రవాణా జరుపాలని సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్ సూచించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సంస్థ డైరెక్టర్లతో కలిసి సింగరేణి వ్యాప్త జనరల్ మేనేజర్లతో బొగ్గు ఉత్పత్తిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏరియాలో లక్ష్యాల సాధనకకు గల ఇబ్బందులను డైరెక్టర్ల సమక్షంలో చర్చించి తక్షణ పరిష్కార మార్గాలు సూచించారు. ఈ ఏడాది నిర్దేషించుకున్న 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించడానికి ప్రతి ఏరియా జీఎం అధికారులతో ఓవర్ బర్డెన్ యజమానులతో సమీక్షిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఆర్థిక సంవత్సరంలో ఇది చివరి నెల అయినందున ప్రతి రోజు ప్రతి షిప్టు విలువైనదని తెలిపారు. సంస్థ డైరెక్టర్ల ఎప్పుడు అందుబాటులో ఉంటామని బొగ్గు ఉత్పిత్తి, రవాణకు సంబంధించిన ఎటువంటి ఆటంకాలు లేకుండా సాఫీగా సాగేలా చూడాలని కోరారు. ఆర్థిక సంవత్సరంలో ఇదే సమాయానికి 601 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా ఈ ఏడాది 4.3 శాతం వృద్ధితో ఫిబ్రవరి చివరి నాటికి 627 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించామని, అలాగే గత ఏడాది ఆర్థికసంవత్సరం 600 లక్షల టన్నుల బొగ్గు రవాణ జరుపగా ఈ ఆర్థిక సంవత్సరంలో 5 శాతం వృద్ధితో ఇప్పటి వరకు 631 లక్షల టన్నుల బొగ్గు రవాణ జరిపి ఆర్థిక సంవత్సరంలో 5 శాతం వృద్ధి సాదించామన్నారు.ఓవర్ బర్డెన్ తొలగింపులో గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి 371 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించగా ఈ ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి చివరి నాటికి 2.7 శాతం వృద్ధితో 381 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించామని తెలిపారు.

మాస్ కాపీయింగ్ లేకుండా చూడాలి

నవతెలంగాణ-నస్పూర్



జిల్లాలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల వార్షిక పరీక్షలలో భాగంగా ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విజన్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కోసం 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, ఇన్విజిలేటర్లు, సిబ్బందిని నియమించి పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్నామన్నారు. పరీక్షలలో ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు, 144 సెక్షన్ అమలు, జిరాక్స్ సెంటర్ల మూసివేతకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా ఏర్పాట్లు చేయడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష కేంద్రాలలో తాగునీరు, మూత్రశాలలు, పారిశుద్ధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు 5,788 మంది జనరల్, 1146 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5,445 మంది జనరల్, 1057 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పథకాలు ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరేలా కృషి చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వివిధ వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం కింద అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరేలా కృషి చేయాలని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. మహాలక్ష్మి, గృహాజ్యోతి పథకాల ద్వారా అర్హత కలిగిన వారందరు ప్రయోజనం పొందేలా అన్ని ఎంపీడీఓ కార్యాలయాలు, మున్సిపల్ వార్డు ఆఫీసులలో సత్వరమే ప్రజాపాలన సేవా కేంద్రాలను నెలకొల్పాలని ఆదేశించారు. రాష్ట్ర డీజీపీ రవిగుప్తాతో కలిసి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. కొత్తగా ఏర్పాటైన పలు మండలాల్లో ఎంపీడీఓ కార్యాలయాలు లేనందున, అలాంటిచోట తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలను అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కేంద్రాలు శాశ్వత ప్రాతిపదికన పనిచేసే అవకాశాలు ఉన్నందున, ఇంటర్నెట్ సదుపాయంతో కూడిన కంప్యూటర్ ఏర్పాటు చేస్తూ, డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలని అన్నారు. వచ్చే సోమవారం నాటికి అన్ని చోట్ల సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చి పనితీరు ప్రారంభం కావాలన్నారు. కార్యాలయాల పని దినాలలో ప్రతి రోజు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సేవ కేంద్రాలు తెరిచి ఉంచాలన్నారు.

టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి...

ప్రస్తుతం కొనసాగుతున్న ఇంటర్మీడియట్‌తో పాటు, త్వరలో ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి సూచించారు. ఏ చిన్న తప్పిదాలు, అవాంఛనీయ ఘటనలకు సైతం తావులేకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్లను అనుమతించ కూడదని, కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యానికి తావిస్తూ, అక్రమాలకు ఆస్కారం కల్పించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణ తీరును అనునిత్యం సమీక్షిస్తూ, పరీక్షలు ముగిసేంత వరకు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, కాపీయింగ్ జరిగేందుకు అవకాశం ఉన్న సెంటర్ల వద్ద అదనపు సిబ్బందిని నియమించాలని పోలీస్ కమిషనర్లు, ఎస్పీలకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఈఓ ప్రణీత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలకు సైతం నిధులు కేటాయించి, అభివృద్ధికి సహకరిస్తున్నామని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలో పొచ్చెర గ్రామంలో ఈజీఎస్ కింద ఎస్డిఎఫ్ నిధులు రూ.5లక్షలతో చేపట్టి సీసీ రోడ్డు నిర్మాణం పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మెన్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వకుండా, అభివృద్ధిని అడ్డుకునే వారని గుర్తు చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కోటాలో రూ.11 కోట్ల ఈజీఎస్ నిధులలో సగం నిధులు ఎమ్మెల్యేకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కష్టపడి చదివాడు కొలువులు సాధించాడు

నవతెలంగాణ-తాంసి



మండల కేంద్రానికి చెందిన బెల్లపు దేవిదాస్ తానుబాయి దంపతుల కుమారుడు నగేష్ రెండు ప్రభుత్వ కొలువులు సాధించాడు. తల్లి దండ్రులు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ నగేష్‌ను చదివించారు. తల్లీదండ్రులు పడుతున్న కష్టాలు ఆర్థిక ఇబ్బందులు చూస్తూ చదువుపై మరింత పట్టుదలతో చదువుకున్నాడు. మొదట ఐదో తరగతి వరకు మండల కేంద్రంలో చదువుకుని, నవోదయ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు కాగజ్‌నగర్ నవోదయ విశ్వవిద్యాలయంలో చదువుకొని, డిగ్రీ ఆదిలాబాద్‌లోని ఓ ప్రయివేటు కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం పీజీ ప్రవేశ పరీక్షల్లో రెండో ర్యాంకు సాధించి, 2017 సంవత్సరంలో బీఎడ్ ప్రవేశ పరీక్ష రాయగా ఏడో ర్యాంకు సాధించారు. 2019లో బీఎడ్ పూర్తి చేసి 2021 లో మధ్యప్రదేశ్‌లోని రేవా సైనిక్ స్కూల్లో అధ్యాపకుడిగా ఉద్యోగం సాధించాడు. ఉద్యోగం చేస్తూనే మరో ఉద్యోగం సాధించాలని పట్టుదల వదలకుండా 2023లో గురుకుల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడటంతో సన్నద్ధమై ఆగస్టులో పరీక్ష రాశాడు. బుధవారం రోజున వెలువడిన ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఐదవ ర్యాంకు సాధించి, గురుకుల డిగ్రీ అధ్యాపకుడిగా విజయం సాధించాడు. గురువారం వెలువడిన గురుకుల జూనియర్ అధ్యాపక ఫలితాల్లోనూ రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించి, మరో కొలువు సాధించాడు. రెండు కొలువులు సాధించిన నగేష్‌ను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

మాంగ్ సమాజ్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండల కేంద్రంలో శుక్రవారం మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు గాడేకర్ పరశురామ్ అధ్వర్యంలో మాంగ్ సమాజ్ గాదిగూడ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి మాంగ్ సమాజ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు శ్రీ గాడేకర్ రామేశ్వర్ హాజరయ్యారు. మాంగ్ సమాజ్ మండల అధ్యక్షుడుగా కాంబ్లే నాగ్‌నాథ్, ఉపాధ్యక్షులుగా గాయక్వాడ్ పండరి, ప్రధాన కార్యదర్శిగా వాగ్మారే ధన్‌రాజ్, సంయుక్త కార్యదర్శి భట్లాడే బాలాజీ, కోశాధికారిగా యాన్‌కుడికే శివాజీలను ఎన్నుకున్నారు.

చేనేత హస్తకళలకు చేయూతనిద్దాం




నవతెలంగాణ-నిర్మల్

చేనేత హస్తకళలకు చేయూతనిద్దామని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రం ఇందిరానగర్‌లో నిన్ ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన, అమ్మకం సముదాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడారు. చేతితో చేసిన ఎన్నో రకాల వస్తువులు, వస్త్రాలు, ఇంటిలో అలంకరణకు, సంబంధించినవి అన్ని అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ నెల 15 తేది వరకు వ్యాపార సముదాయం అందుబాటులో ఉంటుందని అన్నారు. అనంతరం యజమాన్యం మున్సిపల్ చైర్మెన్‌ని మర్యాద పూర్వకంగా సన్మానించారు. కార్యక్రమంలో జాఫర్, నిర్వాహకులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-జైపూర్



భీమారం మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన పుష్పమల్ల సునీల్ (22) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం సాయంత్రం పురుగుల మందు తాగిన సునీల్‌ను మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు ఆధునిక వైద్యం కోసం కరీంనగర్ తరలించగా శుక్రవారం సాయంత్రం చికిత్స పొందుతూ సునీల్ మృతి చెందినట్లు తెలిసింది. భీమారం మండల కేంద్రంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్, టీ స్టాల్ నడిపిస్తున్న సునీల్ ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై పోలీసులను వివరణ కొరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.